# కల్లోల జిల్లా కాదు.. కళలకు పుట్టినిల్లు

## అక్కినేని ఫౌండేషన్ సావనీర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంగుల ● ఏడుగురికి అంతర్జాతీయ పురస్కారాలు ప్రదానం



సినీ రత్న పురస్కారం అందుకుంటున్న సుద్దాల అశోక్ తేజ



విద్యరత్న పురస్కారం అందుకుంటున్న ప్రొఫెసర్ నాగేశ్వర్ దంపతులు



సజ్జ కిశోర్ బాబుకు వ్యాపార రత్న



డాక్టర్ కమలా ప్రసాదరావు దంపతులు



డాక్టర్ ముప్పారపు సింహాచల శాస్త్రి

**కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే :** కరీంనగర్ కల్లోల జిల్లా కాదు.. కళలకు పుట్టినిల్లుగా గుర్తించి అక్కినేని అంతర్జాతీయ పురస్కారాలకు వేదిక చేయడం అభినందనీయమని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం రాత్రి కరీంనగర్ ప్రతిమా మల్టీప్లెక్స్‌లో అమెరికా అక్కినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కినేని అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాగేశ్వర్‌రావు సినిమాలు ఎంతో సందేశాత్మకంగా, సాంఘిక జీవన క్రమశిక్షణ తెలిపేవిగా ఉండేవన్నారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ అక్కినేని సంస్థ వారు సమాజంలో ఎంతో ప్రతిభ, నిస్వార్థపరులైన వారిని ఎంపిక చేశారని నిర్వాహకులను అభినందించారు. కళాకారులు, కవులకు ఇక్కడ కొదవలేదన్నారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఈ పురస్కారాలు పొందిన వారిని చూసి ఇతరులు కూడ ఉత్తేజపడే అవకాశం ఉంటుందన్నారు. పురస్కార గ్రహీత విద్యారత్న ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించిన దానికంటే అవార్డు ఏముంటుందన్నారు. మా నాన్నకు అక్కినేని అంటే చాలా అభిమానం.. తోటకూర ప్రసాద్ పురస్కార ప్రతిపాదన తెచ్చారు. ఈ ప్రతిపాదన వచ్చిన కొన్ని రోజులకే మా నాన్న చనిపోయారన్నారు. ఈ పురస్కారం నాన్నకు అంకితం చేయాలని తీసుకొనేందుకు వచ్చానన్నారు. సినీ రత్న పురస్కార గ్రహీత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ నటుడిగా ఎదిగిన క్రమంలో ముఖం నిండా మచ్చలు ఏర్పడ్డవి.. అప్పుడు డాక్టర్ ప్రతి రంధ్రంలో ఇంజక్షన్ వేస్తే పోతుందని చెప్పడంతో వేయించుకున్న గొప్ప నటుడు నాగేశ్వరావు అని గుర్తు చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ కరీంనగర్ విశిష్టమైన గోదావరి పరివాహక ప్రాంతంతో ఎందరో ప్రముఖులకు క్షేత్రంగా ఉన్న ఈ జిల్లాలో ఈ ఏడాది అక్కినేని అంతర్జాతీయ పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమానికి అక్కినేని ఫౌండేషన్ అధ్యక్షుడు రావు కల్వల అధ్యక్షత వహించగా మేయర్ రవీందర్‌సింగ్, ఎంపీపీ వాసాల రమేష్, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. అక్కినేని ఫౌండేషన్ సావనీర్‌ను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, మేయర్ రవీందర్‌సింగ్ చేతులమీదుగా రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌కు విద్యరత్న, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు సినీరత్న, పారిశ్రామిక వేత్త సజ్జాకిషోర్ బాబుకు విశిష్ట వ్యాపార రత్న, హరికథకుడు డాక్టర్ ముప్పవరపు సింహాచలశాస్త్రి, గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్న ప్రతిమా వైద్యవిద్య కళాశాలకు వైద్యరత్న, లక్షలాది మొక్కలు నాటిన వనజీవి రామయ్యకు సేవారత్న, చిత్రకారిణి డాక్టర్ కమలా ప్రసాదరావుకు వినూత్నరత్న, మార్వెల్ ఆర్ట్స్‌లో జాతీయ, అంతర్జాతీయ కీర్తిని సాధించిన యువ కిషోరం చేరుపల్లి వివేక్ తేజకు యువరత్న పురస్కారాలను ప్రదానం చేశారు. సంఘం ప్రతినిధులు శారద ఆకునూరి, చలపతిరావు కొండ్రకుంట, ధామ భక్తివత్సల, మురళి వన్నెం, ఎస్.వి.రామారావు, వంశీ రామరాజు, తదితరులు పాల్గొన్నారు. నటరాజ రామకృష్ణ నృత్య కళానికేతన్ చొప్పరి జయశ్రీ శిష్య బృందం పేరిణి లాస్య నృత్యం, సంగెం రాధాకృష్ణ శిష్య సంజన బృందం జానపద నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి.



వనజీవి రామయ్య దంపతులు



చేరుపల్లి వివేక్ తేజ



తోటకూర ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం